# ప్రేమ పరిమళించిన వేళ

-డా॥ వాసా ప్రభావతి

ఆ రాత్రి వేళ దీపాలు వెలుగుతున్నా రోడ్లమీద చీకటిదే పైచెయ్యి, వెన్నెల రాత్రి అయినా చుట్టుముట్టిన మబ్బుల సందులలో నుంచి చంద్రకిరణాలు నేలను చేరాలని ప్రయత్నిస్తూనే ఉన్నాయి.

ఆ మసక చీకటిలో భయం భయంగా వెనక్కి తిరిగి చూస్తూ వేగంగా అడుగులు వేస్తూ ముందుకు వెడుతున్న ఆ యువతికి ఆటో కనబడగానే అడుగంటిన ధైర్యం చిగురించింది. ఆటో పిలిచి ఎక్కి కూర్చుంది. ఇంకా అర్ధరాత్రి కాలేదు. చేతి వాచి చూసుకుంది. సరిగా కనపడకపోయినా రాత్రి తొమ్మిది గంటలు కావచ్చు అనుకుంది. తను చేరవలసిన గమ్యం ఇల్లు. ఇంటి అడ్రస్సు చెప్పింది. ఆటో ముందుకు దూసుకు పోతోంది. చేతిలో పుస్తకాల సంచీ మాత్రమే ఉంది. ఆమె ఎక్కడ ఉందో, ఆటో ఎటు వెడుతోందో ఆమె గుర్తుపట్టే స్థితిలో లేదు. వెనక్కి తిరిగి చూసి "వేగంగా పోనీ" అంది. అతను వెనక్కి తిరిగి ఓసారి ఆమెవైపు ఆశ్చర్యంగా చూసి "వేగంగానే పోతోందమ్మా!" అన్నాడు.

ఆమెలోని కంగారు, భయం ఆమె ముఖాన్ని నిశితంగా చూసిన వారికి కనబడుతుంది. ఆటోవాలాకి అవేమీ పట్టలేదు. ఆటో వేగం మరింత పెరిగింది. ఆమె వెనక్కి తిరిగి చూస్తూనే ఉంది. యమకింకరుల వంటి ఆ మనుషులు వెంటపడతారని భయం. తనని వారు చంపేసినా ఫరవాలేదు. మళ్ళీ అక్కడికే తీసుకు పోతారు. యమలోకం ఎక్కడో లేదు ఇదే. యమకింక రులు వీళ్ళే అనుకుని భయంతో వణికింది. రోడ్డుమీద ఎవరి మాటలు వినబడుతున్నా, ఎవరు కంటపడు తున్నా, వాళ్ళేనని ఉలిక్కిపడుతోంది.

అంత కంగారులోనూ ఆటో ఆ వీధిలోకి రాగానే ఇట్టే గుర్తుపట్టింది. తను పుట్టి పెరిగిన వీధి అది. ఎన్ని వందలసార్లు ఆ వీధిలోంచి నడిచిందో, ఆ నేలంతా తన అడుగు ముద్రలే! గుండెలో ఓ ఆనంద రేఖ తళుక్కుమంది.

తన యిల్లు వచ్చేస్తోంది. ఒళ్ళు జలదరిస్తుంటే ఇంటివైపే చూసింది. మూడు రోజుల కిందటి వరకు తనకు సర్వస్వం ఆ ఇల్లే! తనకు అత్యంత ఆత్మీయులు తల్లి, తండ్రి, చెల్లి. 'మునుపటి ఆత్మీయత తనకు ఆ యింట్లో తిరిగి లభిస్తుందా?' తనకి తానే ప్రశ్నించు కుంది. ఆటో దిగి మెట్లు ఎక్కి చూపుడువేలు, మధ్యవేలు కాలింగ్ బెల్ బటన్ మీద పెట్టబోయి చెప్పలేని భయంతో, అర్థంకాని జంకుతో చెయ్యి వెనక్కు తీసు కుంది. తను ఏ తప్పూ చెయ్యకపోయినా మూడు రోజులు శిక్ష అనుభవించింది. లోకం దృష్టిలో తాను మహా పాపి, విధివంచిత.

"నా పైసలియ్యమ్మా!" ఆ మాటలకు తిరిగి ఈ లోకంలోకి వచ్చింది. ఆటోవాలాకి పైసలివ్వడం మర్చిపోయింది. తిరిగి ఆటో దగ్గరకు వెళ్ళి మీటరు చూసి బాగ్‌లోనుంచి డబ్బుతీసి అతని చేతిలో పెట్టింది. ఆటో తిరిగి శబ్దం చేసుకుంటూ బయలు దేరింది. 'ఇంతసేపు తనకి ఆటో రక్షణ, తోడు కూడా? ఇప్పుడు మళ్ళీ తను వంటరిది!' గుండెలు ఒక్కసారి వేగంగా కొట్టుకున్నాయి. తిరిగి ధైర్యం తెచ్చుకుని మెట్లు ఎక్కింది. చెయ్యి పైకెత్తి రెండు వేళ్ళతో బెల్లు నొక్కింది. ఎవరూ లేచిన అలికిడి వినపడలేదు. తిరిగి బెల్లు నొక్కింది.

"ఎవరూ? ఎవరూ?" అంది తల్లి గొంతు.

బయట లైటువేసి కిటికీలోంచి చూస్తున్న తల్లి కనపడగానే "అమ్మా! నేనమ్మా! త్వరగా తలుపు తియ్యమ్మా!" భయంతో వంటరిగా ఇంటి ముందు

## విన్నపము

దేవుడా!
నన్ను ఆడబిడ్డగా మాత్రం / పుట్టించకు
తల్లిగా / చెల్లిగా / భార్యగా
ఏం గౌరవముంది
స్త్రీకి ఈ రోజుల్లో
పుట్టిన పసికందుని
ముళ్ళపొదల్లోనో / పోలిథిన్ కవర్లోనో
చెత్తకుండీలోనో / రైల్వే ట్రాక్ పక్కనో
పారేసి
కుక్కనోట కరుచుకుపోవడం
నాకిష్టంలేదు.

-భూషి కృష్ణదాసు

నిలబడిన ఆమె గొంతు పెగల్చుకుని వచ్చాయి ఆ మాటలు.

"నువ్వా! బిందూ! నా తల్లీ! నా కోసం బతికి వచ్చావా?" చనిపోయిందనుకున్న కూతురు ఎదురుగా కనబడగానే తల్లి పేగు తెంచుకుని వచ్చాయి ఆ మాటలు. గుండెలు బాదుకుంటూనే తలుపు తీసి బయటకు వచ్చి అమాంతం కూతుర్ని వాటేసుకుంది. రెండు వర్షిస్తున్న మేఘాలు పెనవేసుకున్నట్లు ఇద్దరి కన్నీళ్ళు వరదలై పారాయి.

వరద నీరు నేలలో ఇంకినట్లు వారి దుఃఖం హృదయంలో కాస్త కలిసిపోగా "అమ్మా! వాళ్ళు వచ్చేస్తారేమో లోపలికి వెళ్ళిపోదాం!" అంటూ తల్లి చెయ్యి పట్టుకుని లోపలకు రాబోయింది. అంతలో గుండెల్లో ఏదో కలుక్కుమనగా "అమ్మా చెల్లి ఇంకా ఇంటికి రాలేదా?" అంది.

"రాలేదు. చంద్రి నీకు కనబడిందా?" ఆశ్చర్యం, మమకారం పెనవేసుకున్న గొంతుకతో అడిగింది.

"అవునమ్మా! జరిగిందంతా చెప్పాలనుకుంది కాని నోరు పెగల్లేదు."

"తనకంటే ముందు బయలుదేరిన చెల్లి, ఆమెతో ఉన్న స్నేహితురాలి చెల్లెలు చెమ్మీ ఏమయినట్లు? తిరిగి ఆ యమకింకరుల కంట పడలేదు కదా?" బిందు ఇంక ఆలోచించలేకపోయింది.

"ఎవరది? ఎవరది? మాట్లాడరేం?" అది తండ్రి నరసింహం గారి గొంతు. పెద్దపులి గాండ్రింపులా ఉంది. ఎప్పుడూ అలాగే ఉంటుంది. ప్రేమ, ఆదరణ, ఆత్మీయతలకు చాలా దూరంగా కోపం, అహంకారం మెత్తినట్లు ఉంటుంది.

తలుపు తీసిన చప్పుడుకు మెళకువ వచ్చిన నరసింహంగారు వీధి తలుపు వరకు వచ్చి ఎదురుగా ఉన్న కూతుర్ని చూడగానే ఉగ్రనరసింహమూర్తి అయ్యాడు.

"ఎందుకు వచ్చావు? వెళ్ళిపో? నువ్వు చచ్చావని తలకు స్నానం చేసేసా! నీ తల్లి కూడా చేసింది. వెళ్ళిపో! మేమూ చచ్చామనుకో.." గట్టిగా అరిచాడు నరసింహం గారు.

"నే చెప్పేది వినండి నాన్నా!" తన కథ వినిపించాలనుకుంది బిందు.

"నువ్వేం చెప్పనక్కరలేదు. నేను వినవలసిన వన్నీ అయిపోయాయి" అన్నాడు. ఈసారి ఆయన కంఠంలో బాధ కనపడింది.

ముందురోజు పేపర్లో కూతురు బిందూ ఎవరితోనో పారిపోయిందని రాశారు. నిన్న వేశ్యాగృహంలో పట్టుపడిందని రాశారు. భార్యాభర్తలు ఆ వార్త వినలేకపోయారు. పైగా కూతురు కనపడటం లేదని పోలీసు రిపోర్టు ఇచ్చినందుకు వారేదో వెతికి కూతుర్ని తీసుకొచ్చి తీర్పు చెబుతారనుకుంటే కొరివితో తల గోక్కున్నట్లయింది.

"నీ కూతురు వేశ్యాగృహంలో పట్టుబడింది. రండి" అని పోలీసుల నుంచి వర్తమానం. నరసింహంగారు ఆ అవమానం భరించలేక భార్యతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కాని భార్య, కావలసిన వాళ్ళే "నిజానిజాలు తెలుసుకోకుండా చావడమేమిట"ని చివాట్లు పెట్టారు. పైగా "ముందు వెళ్ళి మీ అమ్మాయో కాదో చూసుకోండి? అప్పుడేమి చెయ్యాలో ఆలోచించండి" అన్నారు. ఆయనకి కూడా ఆ సలహా నచ్చింది. పుట్టెడు అవమానం కడుపులో దాచుకుని నిర్వికారంగా నరసింహంగారు భార్యతో పోలీసు స్టేషన్‌కి వెళ్ళాడు. సెల్‌లో ఉన్న అమ్మాయిల నందరిని చూపించారు.

## అడుగు

**చం**ద్రునిపై వేసిన ఆర్మ్‌స్ట్రాంగ్ తొలి అడుగు
చరిత్రకు శ్రీకారం తొడుగు
కలలకు సాకారాన్నిచ్చిన కలాం మలి అడుగు
అనుభవాల గొడుగు
బలి చక్రవర్తి అహంకారాన్ని అణచిన అడుగు
వామనుడి మూడో అడుగు
దూరం దగ్గరవడానికి, దగ్గర దూరమవడానికి
సరిగ్గా నాలుగే నాలుగు అడుగులు
జీవన గతిలో ఆలుమగల అనుబంధం
అల్లుకొనేది ఏడడుగుల నడకతోనే
ఆత్మశోధనలో అసలు తత్వం
ప్రత్యక్షమయ్యేది ఎనిమిదో అడుగులో
తొందరపాటు తొణికిసలాడేది
చిత్తవృత్తి భ్రమ తొమ్మిదో అడుగులో
పరిణతి చెందిన మానవగీతం / పల్లవించు పదవ
అడుగులో / అడుగుకీ అడుగుకీ మధ్య
అనంతకోటి ఆలోచనలు / ఆలోచనల మధ్య కొత్త
అడుగులు / అడుగులు సరిగ్గా వేయలేకపోతే
జీవితం చేరు అట్టడుగు

**–కె.ఎస్. అనంతాచార్య**

వారికి అదో వినోదం. అందరిలో బిందు కనపడలేదు. నరసింహంగారు భార్య ఊపిరి పీల్చుకున్నారు.

'నా కూతురికి ఈ గతి ఎప్పుడు కలగకూడదు' మనసులోనే ఆ కన్నతల్లి దేముడికి నమస్కరించింది.

ఇంటికి తిరిగి వచ్చిన నరసింహంగారు "నా కూతురు చచ్చిపోయింది" అంటూ తలార చన్నీళ్ళతో స్నానం చెయ్యక తప్పలేదు. ఎక్కడా కూతురు జాడ కనపడలేదు. పైగా ఎక్కడా శవం కూడా కనపడలేదు. అందుకే ఎవడితోనో పారిపోయిందని ఆ తండ్రి నమ్మాడు. ఇప్పుడు కూతురు ఎదురుగా కనపడగానే ఆ కోపమంతా వెళ్ళగక్కాడు. "కూతురి మీద ప్రేమ ఉన్నా పైకి కనపడనివ్వడు. పో! పో! ఇంకా నువ్వు నా ఎదురుగా ఉంటే నేనేం చేస్తానో నాకే తెలియదు. వెళ్ళిపో" అంటూ మరింత గట్టిగా అరిచాడు.

"ఈ అర్ధరాత్రి ఎక్కడికి వెడుతుందండీ! తెల్లారగానే వెళ్ళిపోతుంది"

ఆవిడ మాట పూర్తికాకుండానే "ఆ హుసేన్ సాగర్‌లో పడి చావమను. ఇలాటి వాళ్ళు బతకడం కంటె చావడమే నయం" అంటూ మరింత గట్టిగా అరిచాడు. ఇరుగు పొరుగు వింటారేమోనని ఆవిడ భయపడింది.

"లోపలికి వస్తావా లేదా" అంటూ వీధి తలుపులు మూసేశాడు.

అనాథలా చీకటిలో కలిసిపోతున్న కూతుర్ని ఆమె ధైర్యం లేక, భర్తను ఎదిరించి బతకలేననుకున్న ఆ తల్లి కుమిలి కుమిలి ఏడుస్తూ లోపలికి అడుగులేసింది.

"ఈ మగవారు ఇంటి యజమానులు. ఎక్కడా నిధానమే లేదు. పైగా అహంభావంతో, మూర్ఖత్వంతో, ద్వేషంతో రగిలిపోతూ ఉంటారు. నా తండ్రి చాలా ప్రేమగా, ఆత్మీయంగా ఉండేవారు. ఇదంతా నా దురదృష్టమే కాదు, నా పిల్లలది కూడా! కన్న కూతుర్ని అర్ధరాత్రి వేళ మృత్యువు ఒడిలోకి తీసేసి తలుపు లేసుకుని పడుకున్నాడు తండ్రి. కసాయివాడు కూడా కన్నపిల్లల్ని కడుపులో పెట్టుకుని కాపాడుకుంటాడు. నా కన్న కూతురు ఇక నా కంట పడుతుందా! నీతో నేరాలేకపోయిన అభాగ్యురాలిని" అంటూ ఆ కన్నతల్లి ఏడుస్తూనే ఉంది. ఆ ఇంట్లో ఆమెను ఓదార్చేవారే కరువయ్యారు.

"తల్లికి, తండ్రికి అంత దుఃఖాన్ని, అవమానాన్ని కలిగించిన తను చనిపోవడమే నయం. తండ్రి హుసేన్ సాగర్‌లో దూకి చావమని దారి చూపించాడు. ఆ చీకటిలో ఆవేశంతో చావును కోరుకుంటూ అటుకేసి నడిచింది.

టాంక్‌బండ్ నిండా జనం తిరుగుతున్నారు. చాలా మంది కూర్చొని ఉన్నారు. హుసేన్‌సాగర్‌లో దూకడం చాలా కష్టం. మబ్బులు దాటిన చంద్రుని వెన్నెల తెల్లని పట్టు చాందినీలా నేలను కప్పుతోంది. సాగర్ కెరటాల మీద నుంచి చల్లని గాలి సోకుతోంది. అక్కడక్కడ ప్రేయసీ ప్రియులు, నవజంటలు సరస సంభాషణలలో తేలిపోతున్నారు. తండ్రి చచ్చిపొమ్మన్నాడు. ముక్కు మొహం తెలియని ఆయా ఆ సుడిగుండం నుంచి కాపాడింది. పైగా చేతిలో డబ్బు పెట్టి జీవితాన్ని వెతుక్కోమని, ప్రాణాలకు తెగించి ఆ నరకం నుంచి తప్పించుకోడానికి సహాయం చేసింది. ఈ జన్మలో ఆమె రుణం తీర్చుకోలేము. అయినా ఆ నరకంలో నేనే పొరపాటున అడుగుపెట్టాను. ఆ రాజు మోసం చేశాడు. హోరు వానలో బస్టాపులో నిలబడిన తను ఆ రాజు మాటలు నమ్మి కారు ఎక్కింది. రాజెవరో పూర్తిగా తెలియదు. అప్పుడప్పుడు కనపడి నవ్వుతూ పలకరిస్తాడు. ఆ పరిచయంతో అతని మాట నమ్మింది. కాఫీ తాగుదామని క్లబ్బుకు తీసుకువెళ్ళి మోసంచేసి గదిలో బంధించాడు. ఆయా రక్షక భటునిలా గదిలో అడుగుపెట్టింది. ఏ మగవాడు గదిలోకి రాకుండా రెండు రాత్రులు కాపాడింది. ఎవడో వచ్చి డబ్బు సంచి మీదకు విసిరితే భయంతో తాను వణికిపోయింది. పారిపోవడానికి పనికొస్తుందని కొంత డబ్బు చేతిలో పెట్టింది. రాత్రి 9 గంటలకు చౌకీదారు మారేవేళ. వాళ్ళు వచ్చి భోజనం చేసేవేళ వెనక తలుపు తాళం తీసి పారిపొమ్మని పంపించేసింది. అప్పుడే చూసింది పక్కగదిలో ఏడుస్తున్నవారు తన చెల్లి, ఆమె స్నేహితురాలు చంద్రి అని. వారిని తానే ముందు పంపించేసింది. వాళ్ళు ఏమైపోయారో? ఆ కిరాతకుల చేతికి చిక్కకూడదు. పదే పదే అనుకుంది. ఇంకా అక్కడే ఉంటే తనకూ ప్రమాదమే. తాను బతకాలి. చావకూడదు. ఆయా కాపాడింది ప్రాణం పోసుకోవడానికి. డబ్బు చేతిలో పెట్టింది రక్షించుకోవడానికి.

అప్పుడే తాను ప్రేమించిన సందీప్ గుర్తుకొచ్చాడు. ప్రాణ స్నేహితుడు సందీప్. అతని మీద ప్రేమ వెన్ను చరచినట్లయింది. ఆటో ఎక్కి బేగంపేట పోనిమ్మనమని చెప్పింది. ఆ ఫ్లాటు అడ్రసు తెలుసు. నెంబరు తెలియదు. చౌకీదారునడిగినా చెబుతాడు. కొండంత ఆశతో బయలుదేరింది.

సందీప్ తను ఎంతగానో ప్రేమించుకున్నారు. అతను ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం, తను ఎం.సి.ఎ. మొదటి సంవత్సరంలో ఉండగా ఒక కంప్యూటర్ సెంటర్‌లో పరిచయమై గాఢప్రేమికుల య్యారు. ఒకరోజు సందీప్ మోటారు సైకిల్ మీద ఇద్దరూ వెడుతుండగా తండ్రి కంట పడ్డారు. బిందు ఇంటికి తిరిగి వచ్చాక తండ్రి నానా చీవాట్లు పెట్టాడు.

"అతను బాగానే ఉన్నవాడు. చక్కని చదువు కూడా ఉంది" అంది తల్లి నసుగుతూ.

బిందూ తన ప్రేమ విషయం తల్లికి ముందే చెప్పింది.

"నోరు ముయ్యడే. వాడెవడో బాగున్నంత మాత్రాన పెళ్లి చేసేస్తామా? కులం, గోత్రం, వంశం అన్నీ చూసు కోనక్కరలేదా? ఇంత డబ్బు ఖర్చుపెట్టి చదివిస్తున్నా. వెర్రి వేషాలు వెయ్యక చదువుకో. నా పిల్లలు బుద్ధి మంతులు కావాలి. వెకిలి వేషాలు వెయ్యకూడదు. ఆ కుంక ఎవడో కాని నా కంట పడకూడదు. జాగ్రత్త" అంటూ ఆయన వీధుల్లోకి వెళ్లిపోయాడు.

బిందుకు ఏడుపు రాలేదు. ఆలోచిస్తే తండ్రి మాటలు నిజమే అనిపించింది. ఏ కన్నతండ్రైనా బిడ్డల మీద అటువంటి ఆశే పెట్టుకుంటాడు. తన ప్రేమ కోసం తల్లిదండ్రులకు బాధ కలిగించకూడదనుకుంది. అదే విషయం సందీప్‌కు చెప్పింది. అతను కూడా "ఉద్యోగం దొరికిన తరువాత, నీ చదువు పూర్తయిన తరువాతే పెళ్లి చేసుకుందాం. అంతవరకు కాస్త దూరంగా ఉందాం" అన్నాడు.

అతనికి చదువు పూర్తయిపోయి ఉద్యోగంలో చేరాడు. అప్పుడప్పుడు కలుస్తూనే ఉన్నారు. ఒకరి ప్రాణం మరొకరి దగ్గర ఉన్నట్లుగా బాధగా విడిపో తున్నారు. "ఏ అవసరమొచ్చినా నాకు చెప్పు. నేనున్నా నని మరిచిపోకు." అతను ఆత్మీయంగా అన్న మాటల్ని భద్రంగా మనసులో దాచుకుంది. అందుకే తన కష్టం చెప్పుకోడానికి అతని దగ్గరకు బయలుదేరింది.

❍ ❍ ❍

బిందు తిరిగి వెళ్ళిన కొంత సేపటికే తిరిగి బెల్లు మోగింది. తలుపు తెరవాలనుకున్న తల్లి లేచి వచ్చింది.

"ఆ శనిదే మళ్ళీ వచ్చి ఉంటుందా? నే తీస్తా నుండు" మనసులో కూతురు ఏమయిపోయిందో అన్న బెంగ ఉన్నా పైకి కఠినంగా నటిస్తూ వెళ్లి వీధి తలుపు తీయబోయాడు.

"అమ్మా! నేను, తలుపు తియ్యమ్మా" అంటూ తలుపు దబదబ బాదుతున్న చప్పుడయింది.

"చమ్మీ! చమ్మీ" అంటూ చిన్నకూతురు గొంతు గుర్తుపట్టిన ఆ తల్లి లేచి వచ్చింది.

"అమ్మా, నాన్నా" అంటే చెమ్మీ, చంద్రి తలుపులు తోసుకుంటూ లోపలికి వచ్చారు. భయంతో వణుకుతూనే ఉన్నారు.

"అమ్మా! అమ్మా! అక్క రాలేదా? తలుపులు మూసేస్తూ తల్లిని అడిగింది.

"వచ్చింది. మీ నాన్న వెళ్ళిపొమ్మనడంతో వచ్చిన దారినే వెళ్ళిపోయింది."

తల్లి ఏడుస్తూ చెప్పిన మాటలకు చెమ్మీ కంగారుపడి ఏడుస్తూనే జరిగినదంతా చెప్పింది.

"నా బిందూ! ఏ పొరపాటు చెయ్యదని నాకు తెలుసమ్మా! తల్లీ.. ఎక్కడున్నావే" అని తల్లి ఏడుస్తూనే ఉంది.

పోలీసు స్టేషన్‌లో కంప్లైంటు ఇవ్వడానికి చెమ్మీ, చంద్రి సిద్ధమయ్యారు.

నరసింహంగారిలో తెలియని బాధ బయలు దేరింది. తను చేసిన పని ఎంత ప్రమాదకరమైందో తెలుసుకుని ఆయన కూడా బయలుదేరాలనుకున్నాడు. చంద్రి తల్లితండ్రులు కూడా వచ్చారు. అందరూ కలిసి పోలీసు స్టేషన్‌లో కంప్లైంటు రాసి ఇచ్చారు. వాసు సంగతి కూడా చెప్పారు.

ఆ క్లబ్ పేరు వినగానే వారు ఆ రాత్రివేళ వెంటనే వారిని అరెస్టు చెయ్యడానికి బయలుదేరారు.

బిందూ కోసం అంతా వెతికినా ఎక్కడా కనపడ లేదు. ఆ యమకింకరులు చేతికి బిందు దొరికిందేమో నని అందరూ భయపడుతూనే ఉన్నారు. చేతులారా కన్నకూతుర్ని పెద్దపులి నోటికి అప్పచెప్పి, తమ నెత్తిన తామే నిప్పులు పోసుకున్నామని ఆ తల్లి పగు కదిలేలా ఏడ్చింది.

ఆ రాత్రివేళ ఏం జరుగుతున్నాయో ఎవరూ ఊహించలేకపోతున్నారు. సందీప్ కూడా పోలీసు స్టేషన్‌కి వెళ్ళాడు. పోలీసులు అప్పటికే చెమ్మీ, చంద్రి తల్లిదండ్రులతో వచ్చి వెళ్ళిన వివరాలు విని ఆశ్చర్య పోయాడు.

రాజు, సందీప్ స్నేహితుడ కాని చావు బతుకుల్లో ఉన్న రాజు ఫోను చేసి జరిగింది చెప్పడమే కాదు వాళ్ళు తనని చంపడానికి వెంటపడి కత్తితో పొడిచిన సంగతి, అమాయకురాలైన బిందూని మోసం చేసిన సంగతి ఆమెను కాపాడుకోమని చెప్పగానే పోలీసు

స్టేషన్ వైపు వెళ్ళాడు. కాని బిందు కనపడలేదని తెలిసి చాలా బాధపడ్డాడు. బిందు ఇంటికి వెళ్ళి అడిగారు. వాళ్ళు చెప్పిన సంగతి విని మరింత ఆశ్చర్యపోయాడు.

బిందు తనకు దక్కాలి. తన ఫ్లాటుకి వెళ్ళిందన్న గోరంత ఆశతో మోటారు సైకిల్ ఇంటివైపు తిప్పాడు.

గేటు దగ్గరే చౌకీదారు "బిందు అనే అమ్మాయి మీ ఫ్లాటు దగ్గర కూర్చున్నార"ని చెప్పగానే ఉలిక్కిపడి తన ప్రేమదేవత దొరికిందని ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

ఆకలితో కడుపులో పేగులు మెలికలు తిరుగుతుంటే బిందు తల్లి రెండు ముద్దలు అన్నం కూడా పెట్టకుండా పంపించినందుకు బాధపడుతూ ఆ గుమ్మం ముందే నేలకు వరిగిపోయింది. ఇరుగు పొరుగులు చూసి ముఖం మీద నీళ్లుజల్లి పాలు తాగిస్తుంటే సందీప్ అక్కడకు చేరుకున్నాడు. జరిగింది విని తనను వెతుక్కుంటూ ఆమె వచ్చినందుకు ఎంతగానో సంతోషించాడు. తలుపు తాళం తీసి ముందు మంచం మీద కూర్చోబెట్టి తాను వండుకున్న దానిని తినిపించాడు. ఆమె ఏడుస్తూ జరిగింది చెప్పబోయింది. అతనికి అన్నీ తెలుసు. అందుకే చెప్పనివ్వలేదు.

ఆ రాత్రివేళ ఇంటికి వెళ్ళడానికి ఆమె అంగీకరించలేదు. తండ్రి గుర్తుకురాగానే భయంతో సందీప్ వడిలో వాలి అలాగే నిద్రపోయింది. సుఖ దుఃఖాలను శాసించగలిగేది ఆ నిద్రమాత్రమే.

రాత్రివేళలో జరిగినదంతా మరిచిపోయినట్లు సూర్యకాంతితో ఊరంతా వెలిగిపోతోంది. పొద్దుటే పేపర్లో రాజును ఆ క్లబ్బు మనుషులు చంపేసినట్లు వచ్చిన వార్తకు బిందు హృదయం చల్లబడింది. కాని తప్పించుకోలేని ఆయా ఆత్మహత్య చేసుకుందన్న వార్త భరించలేకపోయింది. ఆత్మబంధువు పోయినట్లు బాధపడి సందీప్‌కు చెప్పబోయింది. అవన్నీ నాకు రాత్రే తెలుసు అన్న అతని మాటలకు ఆశ్చర్యపోయింది.

వారి హృదయాలలో ప్రేమ పరిమళించిన వేళ అది, పక్కనే ఉన్న ఇరుగు పొరుగు వారి సమక్షంలో సందీప్ ఉంటున్న ఫ్లాట్‌లో వారి వివాహం జరుగుతుంటే ఆమె తల్లిదండ్రులే కాదు చెమ్మీ, చంద్రిలను చూడగానే బిందు ముఖంలో కోటికాంతులు వెలిగాయి. సందీప్ తనకు చెప్పకుండానే వారిని రమ్మని పిలిచినందుకు మరింత సంతోషించింది.

ఆ కొత్త దంపతుల ప్రేమ పరిమళాలతో ఆ ప్రాంతమంతా ఘుమఘుమలాడింది. ■

## అర్థమయ్యేలా చూడండి

ఏమండీ...
మీ కలానికింకొంచం
పదును పెట్టండి.
బాగానే రాస్తున్నారుగాని
యింకాస్త బాగా రాయండి.
సమస్యలే చెబుతున్నాంగానీ
పరిష్కారం చూపించడంలేదు.
అచ్చవుతున్నాయని ఆనందిస్తున్నాముగానీ
పాఠకులాదరిస్తున్నారా - గమనించండి.
అన్ని పత్రికల్లో కనిపిస్తున్నా
అసలైనవి, వున్నాయేమో చూడండి.
'తగుదునమ్మా' అని రాస్తే కాదు
రాసిందే మళ్లీ చదవండి.
అయినా...
ఎవరి రచనలు చదవకుండానే
కవిత్వం రాస్తానంటే... ఎలా!
ఏం రాస్తున్నారో, / ఎందుకు రాస్తున్నారో
ఏ ఒక్కసారైనా ఆలోచించారా!
తిట్టు కవిత్వం రాయడానికైనా
భాష మీద పట్టుండాలి.
తీరుబడిగా రాస్తున్నాగానీ
రచనలో పటుత్వముండాలి.
మాండలికాన్ని ఎగతాళి చేయకుండా,
మాతృభాషను కించపరచకుండా,
పవిత్రమైన కవిత్వాన్నే
పదుగురికీ పంచండి.
అంతేకానీ...
పదాల జిమ్మిక్కులతో
వాక్యాల విరుపులతో
తోచింది రాసేస్తూ
అందరి మీదా తోసేయకండి.
అందుకే
మీ కలాల కింకొంచం
పదును పెట్టండని ప్రార్థిస్తున్నాము.
అర్థాలు వెతుక్కునేలా కాదు
అందరికీ అర్థమయ్యేలా రాయండి.
'బాగుందీ' అనేలా చూడండి.

-కన్నోజు లక్ష్మీకాంతం